నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 19 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET




## రూ.43 వేలు కూడా రాలేదు..

గతంలో మా అమ్మ పేరుపై వ్యవసాయ భూమి ఉండేది. అప్పుడు మూసాపేట ఏపీజీవీబీలో అప్పు తీసుకున్నాం. మా అమ్మ మృతి చెందడంతో భూమిని అన్నదమ్ములిద్దరి పేర్లపైకి మార్చుకున్నాం. అమ్మ పేరుపై ఉన్న అప్పును క్లియర్‌చేసి రెండేండ్ల కిందట నేను కొత్తగా రూ.43 వేలు రుణం తీసుకున్నాను. మొదటి విడుతలోనే మాఫీ కావాల్సి ఉండగా.. కాలేదు. వ్యవసాయాధికారులు, బ్యాంకోళ్లను అడిగా. రెండో విడుతలో వస్తుందన్నారు కానీ రాలేదు. మూడో విడుత కూడా అయిపాయె. ఇప్పటికీ మాఫీ కాలేదు. అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారు. ఇంక ఎవరిని అడగాలో కూడా అర్థం కావడం లేదు. నాకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలి.

*- శేఖర్, రైతు, నిజాలాపూర్, మూసాపేట మండలం, మహబూబ్‌నగర్ జిల్లా*



జోగుళాంబ గద్వాల జిల్లాలో వరి నాటుతున్న మహిళా కూలీలు

# కొర్రీలతో కాలయాపన

- జోగుళాంబ గద్వాల జిల్లాలో సగం మందికి కూడా మాఫీ కాలే..
- రుణం తీసుకున్నది 95,199 మంది రైతులు
- మూడు విడుతల్లో కలిపి 51,188 మందికే లబ్ధి
- 44,011 మందికి దూరమైన పథకం
- పలు కారణాలతో తప్పించుకుంటున్న సర్కారు
- ఏ ప్రాతిపాదికన మాఫీ చేశారో చెప్పాలని కర్షకుల డిమాండ్



గద్వాల, ఆగస్టు 18 : రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెప్పింది ఒకటి ప్రస్తుతం జరుగుతున్నది మరొకటి. దీంతో రుణమాఫీ అయిన రైతులు సంతోషంగా ఉండగా మాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందుతూ బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇటు వ్యవసాయశాఖ అధికారులు కానీ, అటు బ్యాంకర్స్ కానీ రుణమాఫీ వర్తించని వారికి సరైన సమాధానం చెప్పలేక తప్పించుకుంటుండడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు ఏ ప్రాతిపాదికన రుణమాఫీ చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత వివిధ కారణాలు చూపుతూ అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారు ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. తమకు రుణమాఫీ జరిగేలా చూడాలని అధికారులను కోరుతున్నారు. రుణమాఫీ కాని రైతులు సుమారు 1,100కు పైగా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రంలో ఇప్పటికే ఫిర్యాదులు చేశారు.

జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో రైతులు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు అధికారుల అంచనా ప్రకారం 95,199 మంది రైతులు రూ.501.72 కోట్ల రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేసిన మూడు విడుతల రుణమాఫీలో జిల్లాలో ఇప్పటి వరకు 51,188మంది రైతులకు రూ.440.73 కోట్లు రుణమాఫీ చేసింది. ఇంకా జిల్లాలో రుణమాఫీ కావాల్సిన రైతులు 44,011మంది ఉన్నారు. వీరందరూ బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లి ఎందుకు రుణమాఫీ కాలేదని అడిగితే కొందరికి రేషన్‌కార్డు లేదని, మరికొందరికి బ్యాంకు ఖాతాలు సరిగా లేవని, ఆధార్‌లోని పేరు బ్యాంక్ ఖాతాలోని పేరు సరిపోవడం లేదని, ఇంటిలో ఉద్యోగస్తులు ఉన్నారని వివిధ కారణాలు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో లేని నిబంధనలు ఇప్పుడెందుకని రైతులు అధికారులను ప్రశ్నిస్తే వారి నుంచి సమాధానం రావడంలేదు. దీంతో చాలా మంది రైతులు రుణమాఫీకి అనర్హులుగా మారినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం జరిగిన రుణమాఫీ పీఎం కిసాన్ ఆధారంగా చేసినట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. రుణమాఫీకి సంబంధించి మొదటి నుంచి రైతులకు సరైనా సమాధానాలు చెప్పకుండా అధికారులు గోప్యంగా ఉండడం అనుమానాలకు తావిస్తుందనే విమర్శలు వినపడుతున్నాయి. రుణమాఫీపై అధికారులను నిలదీస్తే పైనుంచి వచ్చిన జాబితా ఆధారంగా చేశామని చెబుతున్నారు. ఏదేమైనా జిల్లాలో రుణమాఫీ అంతా గందరగోళంగా మారడంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు.

### అప్పు ఉన్నా మాఫీ కాలే..

నేను, నా భార్య కలిసి గద్వాల యూనియన్ బ్యాంక్‌లో రూ.1.60 లక్షలు, పీఏసీసీఎస్‌లో రూ.1.03 లక్షల రుణం తీసుకున్నాం. కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన రూ.2 లక్షల మాఫీలో మాకు లబ్ధి చేకూరలేదు. మేము తీసుకున్న రుణం రూ.2 లక్షల లోపు ఉన్నా మాఫీ కాలేదు. ఈ విషయంపై బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఇంకా పై నుంచి జాబితా రాలేదని చెబుతున్నారు. నేను ఏ రకంగా అర్హుడిని కాదో చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.



*- జగన్‌మోహన్‌రెడ్డి, చెనుగోనిపల్లి, గద్వాల మండలం*

### చెప్పేదొకటి.. చేసేదొకటి..

ఎన్నికల సమయంలో బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికీ అడ్డంకులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీలు పెడుతున్నది. ఎస్‌బీఐలో నా పేరిట రూ.1.50 లక్షలు, భార్య రమాదేవి పేరిట రూ.1.50 లక్షల రుణం తీసుకున్నా. ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో మా పేరు లేదు. బ్యాంకర్లు సరైన సమాధానం చెప్పడం లేదు. రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తే మిగతా డబ్బులు చెల్లిస్తానని చెప్పినా పట్టించుకోవడం లేదు. మొదట ఎక్కువ తీసుకున్న డబ్బులు చెల్లించాలని ఆ తర్వాత ఆలోచిద్దామని అంటున్నారు. కాంగ్రెస్ చెప్పేదొకటి చేసేదొకటి.



*- తిమ్మన్న, రైతు, మేలచెర్వు, గద్వాల మండలం*

### అగమ్యగోచరంగా ఉన్నది..

కాంగ్రెస్ ప్రకటించిన రుణమాఫీ గందరగోళంగా ఉంది. స్పష్టత లేక ఇబ్బందులు పడుతున్నాం. బ్యాంకుల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నాం. నేను గోపాల్‌పేట ఏపీజీవీబీలో రూ.లక్షకు పైగా రుణం తీసుకున్నాను. అసలు, వడ్డీ కలిపి రూ.1.50 లక్షలు దాటింది. అదే బ్యాంకులో నా భార్య పద్మ పేరిట కూడా రూ.80 వేల రుణం తీసుకున్నాం. రుణమాఫీలో మా పేర్లు తెలుసుకునేందుకు వెళ్తే సంబంధిత అధికారులు టెక్నికల్ సమస్యలు ఉన్నాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. చాలా మంది రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది.



*- మన్యంనాయక్, రైతు, ఎర్రగట్టు తండా, గోపాల్‌పేట మండలం*

### ఆశలు సన్నగిల్లాయి..

నాకు మూడెకరాల 33 గుంటల భూమి ఉంది. పాన్‌గల్ సింగిల్‌విండో కార్యాలయంలో రూ.1.80 లక్షల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం రుణమాఫీకి మూడు విడుతలు ప్రకటించినా నా పేరు రాలేదు. బ్యాంక్, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నాకు రుణమాఫీ కాలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేది మరొకటి.. రుణమాఫీపై ఆశలు సన్నగిల్లాయి. డబ్బులు మాఫీ అయితే అప్పులు తొలిగి పోతాయనుకుంటే చివరికి నిరాశే మిగిలింది.



*- పవన్‌కుమార్, రైతు, కేతేపల్లి, పాన్‌గల్ మండలం*

### గత ప్రభుత్వమే బాగుండె..

నాకున్న మూడు ఎకరాలపై రూ.1.61 లక్షల లోన్ ఉన్నది. రుణమాఫీలో నా పేరు రాలేదు. వ్యవసాయ, బ్యాంక్ అధికారులను అడిగితే బ్యాంక్ అకౌంట్ పేరుకు ఇంటి పేరు ఉందని, ఆధార్‌కార్డులో ఇంటి పేరు లేదని.. అందుకే మ్యాచ్ కాలేదని చెబుతున్నారు. ఈ అకౌంట్ ద్వారా పదేండ్ల నుంచి లావాదేవీలు నడుస్తూనే ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే అకౌంట్‌పై క్రాప్‌లోన్ మాఫీ కాగా.. మళ్లీ ఇచ్చారు. నాలాగానే ఎంతో మంది ఉన్నారు. ఈ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తున్నది. కేసీఆర్ సర్కారే బాగుండే అని ఇప్పుడనిపిస్తుంది.



*- సంకటి మానస, మహిళా రైతు, వెల్టూరు, చిన్నంబావి మండలం*

### రుణం రెన్యూవల్ చేస్తలే..

వీపనగండ్ల ఐవోబీలో మూడు ఎకరాలపై రూ.99వేల క్రాప్‌లోన్ తీసుకున్నాను. మొదటి విడుతలో రుణమాఫీ అయ్యింది. కానీ, ఇప్పటివరకు రెన్యూవల్ చేసి లోన్ ఇవ్వడం లేదు. బ్యాంక్, వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తే ఒకరిమీద ఒకరు చెప్పుకొంటున్నారు. పేరుకే రుణమాఫీ గానీ.. రైతులకు ఆనందమే లేదు. మాఫీ చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం సాధ్యం చేయడం లేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్య తీర్చాలి. కేసీఆర్ ప్రభుత్వంలో మాఫీ అయిన వెంటనే లోన్ ఇచ్చారు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు.



*- రాధిక, మహిళా రైతు, చిన్నంబావి గ్రామం, వనపర్తి జిల్లా*

# నెలరోజులైనా..

- మొదటి విడుతకే మోక్షం లేదు!
- రైతుల ఖాతాల్లో జమకాని మాఫీ నిధులు
- సాంకేతిక లోపమంటూ బ్రేకులు
- 1,100 అకౌంట్లకు అందని డబ్బులు
- ఎప్పుడు వస్తాయో చెప్పని అధికారులు

వనపర్తి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ పథకంలో అన్నదాతలను పలు రకాల సమస్యలు వెంటాడుతున్నాయి. రుణమాఫీ రాక రైతులు ఒక వైపు బాధపడుతుంటే.. మరోవైపు మాఫీ అయినా సాంకేతిక సమస్యలంటూ నెలల తరబడి అమలుకు నోచుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం చెప్పినట్లుగా మూడు విడుతల్లో రుణమాఫీని ప్రకటించి అమలు చేసింది. అమలులోనే అనేక పొరపాట్లు ఉండడంతో చాలా మంది రైతులు రోడ్డెక్కుతున్నారు. సమస్యతో వచ్చిన బాధితులకు ఓదార్పునిచ్చి కనీసం విషయాన్ని చెప్పడం కూడా గగనమైంది. ఈ క్రమంలో రైతులకు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక చివరకు కలెక్టరేట్ బాట పడుతున్నారు. జిల్లాలో 56 బ్యాంకులు ఉండగా, 1,17,220 అకౌంట్ల ద్వారా పంట రుణాలిచ్చారు. మూడు విడుతల్లో కలిపి జిల్లాకు రూ.426 కోట్ల రుణమాఫీ మంజూరైంది.

**లిస్ట్‌లో పేర్లు వచ్చాయి.. కానీ మాఫీ కాలే..**

జిల్లాలో మొదటి విడుత మాఫీలో 1,100 అకౌంట్లకు పైగా రుణమాఫీకి దూరంగా ఉన్నాయి. ఈ అకౌంట్లన్నీ మాఫీ పరిధిలోకి వచ్చినవే. లిస్టులో రైతుల పేర్లు ఉన్నాయి. అయితే, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు మొదటి విడుత రుణమాఫీ డబ్బులు ప్రభుత్వం నుంచి ఇంకా జమ కాలేదు. జూలై 18న తొలి మాఫీని ప్రభుత్వం విడుదల చేసిందంటే.. నేటికీ నెల దాటింది. అయినా ఇప్పటికీ వారి సమస్య తీరలేదు. మిగిలిన బ్యాంకుల్లో రుణమాఫీ డబ్బులు జమ అయినప్పటికీ జిల్లాలోని రెండు ఐవోబీ బ్రాంచ్‌లకు నిధులు జమకాక పోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలోని వీపనగండ్ల, వనపర్తి కేంద్రాల్లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో దాదాపు రూ.లక్షలోపు రుణమున్న రైతులు, మాఫీ పథకంలోకి వచ్చే రైతుల అకౌంట్లు దాదాపు వెయ్యికిపైగా ఉన్నాయి.

**ముందు 15 రోజులన్నారు..**

మొదటి విడుత రుణమాఫీలో డబ్బులు పడని అకౌంట్ల సమస్యను 15 రోజుల్లో క్లియర్ అవుతుందని ముందుగా ఆయా బ్యాంకుల అధికారులు చెప్పారు. ఇప్పుడు నెల రోజులు గడిచినా పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు తమకు రుణమాఫీ వస్తుందో లేదో అన్న గందరగోళానికి గురవుతున్నారు. రెండు నెలల నుంచి రుణమాఫీ పథకం ప్రచారం ఉధృతంగా సాగుతున్నది. రైతులు గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. సాంకేతిక సమస్య వల్ల నిధులు జమ కాలేదని, ఇందుకు సమయం తీసుకుంటుందని బ్యాంకర్లు చెబుతుండడంతో ఎటూపాలుపోని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు పడుతుందో ఈ సమస్య పరిష్కారానికి అంటూ రైతులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. జీరో నుంచి మొదలైన అకౌంట్ల నెంబర్లలో చిన్నపాటి లోపం తలెత్తింది. 15 అంకెలుండాల్సిన బ్యాంకు కోడ్ 14 అంకెలు మాత్రమే కనిపిస్తున్నందునా సాఫ్ట్‌వేర్ లోపంతో ఈ సమస్య వచ్చిందని బ్యాంకర్లు చెబుతున్నారు.

**వారి ఆశలు.. అడియాశలేనా..**

ఒక ఇంట్లో ఇద్దరు రుణాలు పొందిన వారి ఆశలు.. అడియాశలైనట్లేనా అన్న సందేహాలు రైతుల్లో వక్తమవుతున్నాయి. పంటరుణాల కోసం ఇరువురిపై భూములను పట్టా చేసుకోవడం.. రుణాలు పొందడం జరుగుతున్నది. రేషన్ కార్డుతోపాటు ఇతర షరతులేవి లేకుండానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించండంతో రైతులందరూ ఆశలు పెట్టుకున్నారు. చివరకు కేవలం రూ.2 లక్షల లోపు ఉన్న రైతుల వరకే మాఫీ ప్రకటన రావడంతో జిల్లాలో వేలాది మంది రైతులు బావురుమంటున్నారు. ఒక్కొక్క ఇంట్లో ఇద్దరేసి చొప్పున రుణాలు తీసుకున్న కుటుంబాలు జిల్లాలో అధికంగానే ఉన్నాయి. కనీసం ఇంట్లో ఒక్కరికైనా మాఫీ రావడం లేదన్న ఆందోళన వెంటాడుతున్నది.

## పెంట్లవెల్లి సొసైటీలో ఒక్క రూపాయి మాఫీ కాలే..

రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం ఢంకా బజాయించి మరీ చెప్పుకొంటూ.. రైతులను మోసం చేస్తున్నది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని పీఏసీసీఏస్‌లో 30, 40 శాతం మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. కానీ పెంట్లవెల్లి పీఏసీసీఎస్‌లో మొత్తం 499 మంది రైతులు రుణమాఫీకి అర్హులు ఉన్నా మూడు విడుతల్లో ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉండి కూడా రైతుల గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రుణమాఫీ కమిషనర్, డీసీవో, కలెక్టర్లు స్పందింది అర్హులందరికీ రుణమాఫీ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.



*- మారుపాకుల చిట్టెమ్మ, మాజీ జెడ్పీటీసీ, పెంట్లవెల్లి మండలం*





పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## బహుజన వీరుడు సర్వాయి పాపన్న

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 18 : అన్ని కులాలను ఏకం చేసి ఆసియా ఖండంలోనే 33 కోటలను జయించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న మహరాజ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్‌లో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతాన్ని పీడిస్తున్న మొఘల్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి, తెలంగాణ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయికి తీసికెళ్లిన గొప్ప వీరుడు పాపన్న మహరాజ్ అన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు జీవోతో పాటు నిధులు విడుదల చేశామన్నారు. పాపన్న కోటకు మరమ్మతులు చేశామని, కోకాపేట్‌లో పాపన్న పేరుతో భవన నిర్మాణానికి రూ.ఐదు కోట్లు కూడా విడుదల చేశామన్నారు. పాపన్న తన సంపదను ప్రజలకు ధారదత్తం చేసిన మహరాజ్ అని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయన విగ్రహాలు దాదాపుగా మూడు వందలకుపైగా ఏర్పాటు చేశామని, ఆయన వారసులుగా గ్రామాల్లో గుడులు, బడులకు సహకారం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, పాపన్న జీవిత చరిత్రను అందరికీ తెలిసేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్లు రవికిషన్, గణేశ్, నవకాంత్, ఆంజనేయులు ఆకుల శివ, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రక్షాబంధన్

- మార్కెట్‌లో వినూత్న ఆకృతుల్లో రాఖీలు
- ఆకట్టుకుంటున్న డిజైన్లు

మహబూబ్‌నగర్/వనపర్తి టౌన్, ఆగస్టు 18 : నీవు నాకు రక్ష నేను నీకు రక్షా.. అంటూ జరుపుకొనే పండుగ రక్షా బంధన్. ఈ పండుగ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఎంత దూరానా ఎంత బిజీగా ఉన్నా ఏటా పండుగ రోజున అక్కా చెల్లెళ్లు అన్నా దమ్ములకు రాఖీలు కట్టి వారి అనుబంధాన్ని చాటుకుంటారు. సోదరుడి ప్రతిఅడుగు విజయం వైపు సాగాలని ఉన్నత శిఖరాలకు చేరాలని కోరుకుంటూ సోదరి రాఖీ కడుతుంది. దీనికి బదులుగా సోదరికి ఏ కష్టం వచ్చినా కాపాడుతానని సోదరుడు వాగ్దానం చేస్తూ కానుకలు అందిస్తారు.

**చారిత్రక నేపథ్యం ఇలా..**

పురాణ ఇతిహాసాల్లో రాఖీ గురించి అనేక కథలు ఉన్నాయి. రాక్షసులు, దేవతలకు జరుగుతున్న యుద్ధంలో రాక్షస సంహారణ చేసే సందర్భంలో ఇంద్రుడు రాక్షసులను సంహరించడం వీలుకాక అమరావతిలో దాచుకుంటాడు. ఇంద్రుడి సతి అయిన ఇంద్రాణి రాక్షసుడిని సంహరించడానికి ఇంద్రుడికి ప్రేరణ కలుగజేస్తుంది. అందులో భాగంగా పార్వతి, లక్ష్మీదేవీలు శ్రావణబౌద్ధ రాఖీ పౌర్ణమిన ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంద్రుడికి రాఖీ కట్టి రాక్షసులను సంహరించడానికి పంపగా రాక్షసుడిని వధించి దేవతలకు అధిపతిగా ఇంద్రుడు నిలుస్తాడు. దీంతో నాటి నుంచి నేటి దాకా రాఖీ పౌర్ణమి జరుపుకోవడం ఆనవాయితీ అని చెబుతున్నారు. అదేవిధంగా శ్రీకృష్ణుడు రాక్షసుడిని సంహరించడానికి సుదర్శన చక్రాన్ని ఉపయోగించాడని ఆనాటి నుంచి రాఖీ పండుగ ప్రాచుర్యంలో ఉన్నది కూడా చెబుతారు. మరో చరిత్రలో ప్రపంచాన్ని జయించాలనుకున్న గ్రీకు రాకుమారుడు అలెగ్జాండర్ భారత్‌పై దండెత్తినప్పుడు జీలం నది ఒడ్డున పురుషోత్తమునితో యుద్ధం జరుగుతున్న సమయంలో అలెగ్జాండర్ భార్య రుక్సానా తన మేలుకోరి భారత ఉపఖండం వాయువ్య భాగాన్ని పాలిస్తున్న రాజు పురుషోత్తమునికి రాఖీ కడుతుంది. సోదరి సౌభాగ్యం కోరి పురుషోత్తముడు అలెగ్జాండర్‌ను ప్రాణాలతో విడిచిపెట్టాడని చరిత్ర చెబుతున్నది. ద్వాపర యుగంలో కృష్ణుడి చేతికి గాయమైనప్పుడు ద్రౌపదిదేవి తన చీర కొంగును చింపి గాయానికి కడుతుంది. దీంతో దానినే రక్షగా రాఖీగా పిలుస్తున్నారు.



పాలమూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

**ఆకర్షణీయమైన రూపాల్లో రాఖీలు**

ఒకప్పుడు నూలు దారంతో రాఖీలు తయారు చేస్తుండగా.. ప్రస్తుతం వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయమైన రూపాల్లో లభ్యమవుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఈ పండుగను ఉత్సవంలా ఉత్సాహంగా జరుపుకొంటారు. ఆకట్టుకునే ఆకృతుల్లో రాఖీల తయారీకి జైపూర్, కోల్‌కతా, ముంబై ప్రసిద్ధి అక్కడి నుంచే ఎక్కువగా దిగుమతి అవుతాయి. గతంలో జైపూర్ మెరుపు కాగితాన్ని వివిధ ఆకారాల్లో చుట్టి వాటికి మెరుపులు అద్ది ఓం, స్వస్తిక్, సూర్యుడు. గణపతి, ఆకారాలు కలిగిన బిళ్లలు మధ్యలో అమర్చేవారు. ఇప్పుడు కోల్‌కతా నుంచి వచ్చే రాఖీలు కూడా ఇలాగే సంప్రదాయ రీతిలో తయారు చేస్తున్నారు. పూసలు, కలశం, శంఖు, చక్రాలు, గణపతి ఆకారం, స్వస్తిక్, ఓం తదితర రూపాల్లో రాఖీలను తయారు చేస్తున్నారు. వీటి ధర కాస్త ఎక్కువే రూ.40నుంచి రూ.100వరకు పలుకుతున్నాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. దూది, దారంతో తయారు చేసిన రాఖీలు చేతికి అందంగా కనిపిస్తాయి. చిన్నారుల కోసం టీవీల్లో వచ్చే బాల గణేశ్, చోటా భీం, బెన్‌టెన్, మిక్కీమౌస్, ఫ్యాషన్ బోటిక్, యాక్సెసరీస్, మోటుపత్తు, ఐస్‌క్రీమ్ కప్, లిటిల్ గణేశ్ తదితర రకాల రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. డిజైన్లను బట్టి రూ.10 నుంచి రూ. 2వేలు ధర ఉన్న రాఖీలు అందుబాటులో ఉన్నాయి. వెండి, బంగారు తొడుగులతో ఉన్న రాఖీలు కూడా మార్కెట్లో ఉన్నాయి.

## డీసీసీబీ అధ్యక్ష పదవికి ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ఆగస్టు 23న ఎన్నికలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 18 : మహబూబ్‌నగర్ జిల్లా సహకార బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్‌నగర్ అధ్యక్ష పోస్టుకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్లు సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటస్‌పాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ లిమిటెడ్ మహబూబ్‌నగర్ ప్రెసిడెంట్ ఎన్నికకు ఆగస్టు 23న బ్యాంక్ ఆవరణలో నామినేషన్లు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్ష ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి 15మంది డైరెక్టర్లు ఓటింగ్‌లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆగస్టు 23న ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 12 నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 2:30 గంటలకు అభ్యర్థుల తుది జాబితా, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి 5:30 కు ఓట్ల లెక్కింపు, తుది ఫలితాలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.



*'మన గుడి-మన బాధ్యత'లో భాగంగా పెబ్బేరు మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్‌లోని కర్రెమ్మ ఆలయంలో ఆదివారం హిందూ జాగృతి సభ్యులు పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. గర్భ గుడిని నీటితో శుభ్రపరిచారు. గుడికి రంగులు వేశారు. సుమారు వంద మంది చందాలు పోగు చేసుకొని ఇప్పటివరకు ఐదు ఆలయాలను శుభ్రం చేశారు. - పెబ్బేరు, ఆగస్టు 18*










